# మనోరంజితం – 2

మరునాడు ఉదయం మహిమ ఇచ్చిన నెంబరుకు ఫోను చేసి మాట్లాడి… వాళ్ళిద్దరినీ తమ ఇంటికి భోజనానికి ఆహ్వానించింది.

మహిమ తల్లి వసుంధర మధ్యాహ్నం కాకుండా సాయంకాలం వస్తామని… ‘‘భోజనానిదేం

ఉందీ, మరోసారి చూద్దాం లెండి…’’ అంటూ ఆ ప్రతిపాదనని సున్నితంగానే తిరస్కరించింది.

మనోరమ కూడా సరేనంటూ అంగీకరించింది.

అనుకున్న ప్రకారం సాయంకాలం వచ్చిన వారిద్దరినీ మనోరమ సాదరంగా ఆహ్వానించింది.

మహిమ ఉత్సాహంగానే ఉందిగానీ, వసుంధర మాత్రం ఏమీ పట్టనట్లు నిరాసక్తంగా ఉండటాన్ని మనోరమ గమనించింది.

ఆమాటే ఆమెతోనూ అంది మనోరమ.

‘‘అదేం లేదు… నేను మామూలుగానే ఉన్నానండీ…’’ అంటూ నవ్వే ప్రయత్నం చేసింది.

‘‘మీరేం మోహమాటంగా ఉండకండి. మీరేం అడగాలనుకున్నా సందేహించకండి. ఏ విషయం అయినా నిస్సంకోచంగా మాట్లాడుకుంటే… అనవసరమైన అపోహలు ఏర్పడకుండా ఉంటాయి…! మీరేం లేదని అన్నాగానీ, మీ మనసులో ఏదో ఉందనిపిస్తోంది మరి…!’’ అంది మనోరమ.

వసుంధర నిర్లిప్తంగా నవ్వింది.

‘‘నేను మా అమ్మాయిలా కొత్తవాళ్ళతో తొందరగా మాటలు కలపలేను. అదీ విషయం. కాకపోతే… మా అమ్మాయి గురించి మీకూ ఓ మాట చెబుదామని ఉంది. చాలా మొండిది…!’’ అంటూ మహిమ వైపు కొంచెం చురచుర చూసింది.

మహిమ జవాబేం చెప్పకుండా నవ్వేసి వూరుకుంది.

మనోరమ మాత్రం ‘‘అవునా… నిన్న తన మాటలు విన్నాక… కొంచెం ఆత్మ విశ్వాసం ఎక్కువే అనుకున్నానంతే… మీకేమో, మొండితనంగా అనిపిస్తోంది కాబోలు…!’’ అంది.

మహిమ కల్పించుకుని మనోరమతో అంది ‘‘నేను ఇప్పటి వరకూ ఏ విషయంలోనూ అమ్మ మాటను కాదనలేదు. మొదటిసారిగా నా జీవితానికి సంబంధించి… ముఖ్యమైన నిర్ణయాన్ని తన ఇష్ట ప్రకారం కాకుండా… స్వతంత్రించానని… నన్ను మొండిదానిగా అమ్మ తీర్మానించేస్తోంది…!’’

వసుంధర నిట్టూర్చింది.

''ఇప్పటివరకూ... తను కాదనే అవసరమే రాకుండా, నేనే తన ఇష్టాన్ని గమనించే అన్ని విషయాల్లోనూ నిర్ణయాలు తీసుకున్నాను. ఇపుడే, నేను మొదటిసారిగా తన నిర్ణయాన్ని వ్యతిరేకించాను!'' అంది వసుంధర.

మనోరమ కొంచెం ఆశ్చర్యంగా ఇద్దర్నీ చూసి ''దేని గురించి మీరు మాట్లాడుతున్నారో... నాకు అర్థం కాలేదు...!'' అంది.

మహిమ నవ్వేసింది.

వసుంధర మహిమ వైపు కొంచెం కినుకగా చూస్తూ ''అమ్మాయి సంగతేనండీ... తన పెళ్ళి విషయంలో నా అభ్యంతరాన్ని లెక్క చేయడం లేదు... కొట్టిపారేసింది. మనసులో మాటను మీరు చెప్పమన్నారని... ఆగలేక చెప్పేసాను మరి...'' అని చెప్పి నిట్టూర్చింది.

మనోరమ కొంచెం ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసి చూస్తూ ''మీకూనా..?!'' అంది.

వసుంధర మళ్ళీ నిట్టూర్చి... ''నిన్న మీ ఇంటికి నన్నూ రమ్మంది. నేను రానని, నాకు ఇష్టం లేదని గట్టిగా చెప్పేసినా... మీ ఇంటికి తనొక్కతే వచ్చింది అయితే... ఇంటికి వచ్చాక మీ మధ్య జరిగిన సంభాషణ అంతా నాకు వివరంగా చెప్పేసరికి... చాలా ఆశ్చర్యంగా ఉంది! మీరు... అంత నిజాయితీగా... మీ అబ్బాయి గురించి నిజాల్ని చెబుతూ మా అమ్మాయిని ఆలోచించుకోమని హెచ్చరించటం... చాలా గొప్ప విషయంగా అనిపించింది! అందుకే... మీరు పిలవగానే, నేనేం సంశయించకుండా వచ్చేశాను! ఇప్పుడిలా మాట్లాడేస్తున్నాను...'' అంటూ మనోరమ వైపు కొంచెం బెరుకుగా చూసింది.

''మీరు... ఇలా మాట్లాడటమే బావుంది. అయితే, ఒక ప్రశ్న, మా వాడి గురించి.... మీ అమ్మాయి చెప్పిన వివరాలు ఏంటీ... మీకెందుకు అభ్యంతరం కలిగిందీ... అదీ చెప్పండీ...'' అభ్యర్థిస్తున్నట్లుగా అడిగింది మనోరమ.

''నేనే చెబుతానండీ...'' అంటూ సిద్ధపడిన మహిమ వైపు చురచుర చూసి ''నువ్వు... నీ వాదన ఏమిటో తర్వాత చెబుదువుగానీ! నన్నడిగారు కాబట్టి... ముందుగా నన్ను మాట్లాడనివ్వు...'' అంది వసుంధర.

''సరే.... సరే... చెప్పు... నేనేం కాదనను...'' అంది మహిమ చిరునవ్వుతో.

వసుంధర మనోరమ వైపు తిరిగి ''ఏం లేదండీ...'' అంటూ మొదలు పెట్టింది.

''పరీక్షలయ్యాయి... ఇంట్లో వూరికే కూర్చుంటే బోర్ గా ఉందీ. బెంగుళూరులో ఉన్న ఫ్రెండుని కలిసి వస్తానంటే సరే నన్నాను. ఆ ఫ్రెండు అక్కడ ఉద్యోగం చేస్తోంది లెండి. వెళ్ళిన రెండు రోజులకే ఫ్రెండు ఉద్యోగం చేస్తున్న సెంటరులోనే... పేరేదో చెప్పిందిగానీ, అపుడు నేనంతగా పట్టించుకోలేదు... తనూ ట్రైనీగా చేస్తానని చెప్పింది.

నాలుగు నెలలే అని చెప్పింది. నేనెపుడూ తన ఇష్టాలకి అభ్యంతరం చెప్పను కాబట్టి దీనికీ సరేనన్నాను. అన్నిరకాలుగానూ ఆలోచించి నిర్ణయించుకుంటుందని తనపట్ల నాకు నమ్మకం ఉంది. భవిష్యత్తులో ఏ ఉద్యోగానికైనా ఆ ట్రైనింగూ పనికి వస్తుందేమోననీ అనుకున్నాను. తనూ ఆ ట్రైనింగు తీసుకోవటానికి కారణం వేరే ఉందని తర్వాత తెలిసింది...''

''ఏమిటంటారూ...?'' మధ్యలోనే అడిగింది మనోరమ.

''అది... మందు లాంటి వ్యసనాలకు బానిసలయిన వాళ్ళకు ట్రీట్‌మెంట్ ఇచ్చే సెంటర్ అని నాకు తెలిసింది. అక్కడ సైకియాట్రీ ట్రైనీగా పనిచేస్తున్న ఫ్రెండ్ ద్వారా పరిచయమైన ఒక యువకుడితో మా అమ్మాయి ప్రేమలో పడి... తనూ ఆ సెంటర్ లో పనిచేయటం మొదలు పెట్టింది. తాగుడు అలవాటునుండి అతను పూర్తిగా బయటపడ్డాడనీ, అతనినే పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లుగా మహి చెప్పినప్పటినుండీ నాకు ఒకటే ఆందోళన.. నా అభ్యంతరాన్ని లెక్కచేయనంతగా అతని పట్ల ఇష్టాన్ని పెంచుకుంది...''

''ఒక్కమాట...'' మనోరమ మధ్యలో అడిగింది.

''మీరు... ఎందుకు కాదన్నారు...? అతనికి ఆ అలవాటు లేదని, పూర్తిగా మానేసాడని మహిమ చెప్పేవుంటుందిగా...!''

వసుంధర ''చెప్పిందండీ...'' అంటూ నిట్టూర్చింది. ''ఆ అలవాటుకు బానిసయిన వాళ్ళు ఏ కారణంతో మానేసినాగానీ, మళ్ళీ మామూలు అయిపోతారని... అంటే... తేలికగా లొంగిపోతారని నా అనుభవం చెప్పింది మరి... అందుకే....''

''అంటే...?'' మనోరమ ఆమె వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

''అదీ చెబుతాను. ఒక్క మాటలో చెప్పొచ్చుగానీ, నా ఆవేదన అర్థమౌతుందని... కొంచెం వివరంగానే చెబుతా. నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నపుడు... ఒకటి మా అందరికీ బాగా నచ్చింది. అన్ని విషయాలూ మాట్లాడుకుని, ఇక నిశ్చయమని అనుకుంటున్న సమయంలో మా దగ్గిర బంధువుల్లో ఒకరు ఆ అబ్బాయికి మందు అలవాటు ఎక్కువనే కబురు చేరవేసారు. దాంతో మావాళ్ళు సందిగ్ధంలో పడ్డారు. వాకబు చేస్తే అతను నిజాయితీగా నిజమేనని ఒప్పుకుని పెళ్ళి తర్వాత మానేస్తానని చెప్పాడు. మా వాళ్ళకు నమ్మకం కుదరలేదు. ఎందుకొచ్చిన గొడవని అనుకుంటున్నారనే విషయం తెలిసి... అతను, నాకు మాట ఇస్తున్నట్లుగా ప్రత్యేకంగా తెలియజేశాడు. దాంతో నేను ఆ సంబంధమే చేసుకుంటానని పట్టుబట్టాను.

మావాళ్ళుఎంత నచ్చచెప్పినా నేను వినిపించుకోలేదు. దాంతో మానాన్నకు బాగా కోపం వచ్చి.... పెళ్ళి చేసినాగానీ, తర్వాత ఏం జరిగినా బాధ్యత తీసుకోమనీ, ఎటువంటి బంధమూ, బాధ్యత

ఉండదని హెచ్చరిస్తున్నట్లుగా బెదిరించారు. నేనూ బింకంగా సరేనన్నాను, కొంచెం అయిష్టంగానే పెళ్ళిచేసి మావాళ్ళు చేతులు దులుపుకున్నారు.

నా కోరిక నెరవేరిందనే సతోషమేగానీ, నేనేం బాధపడలేదు. మా అత్తగారూ వాళ్ళు మొదటినుండీ మాతో అంటీ ముట్టనట్లుగానే ఉండేవాళ్ళు. ఎవరెలా ఉంటేనేం అన్నట్లుగా మేమూ స్వతంత్రంగా, ఆనందంగానే రోజులు గడిపేశాం!

మావాళ్ళు నాకిచ్చిన పదెకరాల కందితోటను ఆయన అమ్మేసి సరదాలకీ, జల్సాలకీ కైంకర్యం చేసేసారు! నేను దానికీ ఏం చింతించలేదు. పైగా... మా తోటి ఉద్యోగస్థులంతా సైకిళ్ళమీద, స్కూటర్లమీద తిరుగుతుంటే... మేం దర్జాగా కారులో క్లబ్బులకీ, షికార్లకీ తిరగగలగుతున్నామని గొప్పగా భావించేదానిని! ఆయన కొన్నాళ్ళు మందు అలవాటుకు దూరంగానే ఉన్నారు. నాకు ఇచ్చిన మాటకు కట్టుబడివున్నారని... ఆయన నిజాయితీకి సంబరపడిపోతూ... మావాళ్ళ దగ్గిర ''ఇప్పుడేమంటారూ...?'' అన్నట్లుగా గొప్పగా చూసేదాన్ని. ఆ విషయంగా మా వాళ్ళెవరూ సంతోషించినట్లుగా కాకుండా, ముభావంగానే ఉండేవాళ్ళు. వాళ్ళ మాట నిజం కానందుకు ఇంకెలా ఉంటార్లే అనుకున్నాను.

ఆ తరువాత.... మెల్లగా మందు అలవాటు ప్రారంభించినా, నేనేం మాట్లాడలేదు, రోజుల్ని బట్టి ఆ మాత్రం అలవాటు అందరికీ ఉంటుందని సరిపెట్టుకున్నాను. చివరకు... అది ఒక్క రోజుకూడా మానలేనంత వ్యసనంగా మారాక, నేనేం చెప్పినా వినరని అర్థమై... మౌనంగా ఉండటం అలవాటు చేసుకున్నాను. అంతకన్నా గత్యంతరం లేకపోయింది!

చివరకు ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయని స్థితికి వచ్చేసారు. ఒళ్ళు తెలియని స్థితిలో కారు నడుపుతూ యాక్సిడెంట్ చేసి... ప్రాణం పోగొట్టుకున్నారు...'' గద్గదమైన కంఠాన్ని కూడదీసుకోవటానికన్నట్లు కాసేపు వసుంధర మౌనంగా ఉండిపోయింది.

మనోరమ కొంచెం దగ్గిరకు జరిగి... ఆమె చేతిని పట్టుకుంది.

వసుంధరా తెప్పరిల్లినట్లుగా మామూలుగా మారి మళ్ళీ మాటలు మొదలు పెట్టింది. ''అప్పటికి మా అమ్మాయికి ఎనిమిదేళ్ళు ఉంటాయండి!

ఆ దుర్ఘటన కలిగించిన విచారాన్నుండి తేరుకోవటానికి చాలా సమయం పట్టింది! ఎవరి ఆసరా లేదు... ఆర్థికంగా, శారీరకంగా చాలా బాధలే ఎదుర్కొన్నాను. ఒక బంధం ఉంది కాబట్టే... కూతుర్ని పెంచి ప్రయోజకురాలిని చేయాలనే లక్ష్యంతో నిలదొక్కుకున్నాను. పెళ్ళికి ముందు ఆపేసిన చదువును కొనసాగించాను.

ఎవరి దగ్గర్నుండీ నేను సహాయాన్ని ఆశించలేదు... అర్థించలేదు. తాగినమైకం అంటూ కారణం చూపటం వలన నష్టపరిహారమూ ఎక్కువరాలేదు. కొంత అప్పులకి పోగా, మిగిలిన దానితో ఎలాగో రోజుల్ని గడిపి... పరీక్షలు రాసి... పట్టుదలతో ఉద్యోగాన్ని సాధించాను!

అమ్మాయికి పెళ్ళిచేసి పంపించి... బాధ్యత తీరాక, ఇంకో నాలుగేళ్ళలో రిటైరయ్యాక... విశ్రాంతిగా, ప్రశాంతంగా రోజుల్ని వెళ్ళదీస్తాననుకుంటుంటే... చూడండి... నాకు మళ్ళీ ఇలాంటి సమస్య వచ్చి పడిరది. సరిగ్గా... అపుడు నేనుమావాళ్ళతో వాదించినట్లే, తనూ మాట్లాడుతోంది...! ఆ వయసులో అది సహజమేనని అర్థం అయినా, తల్లిగా తన భవిష్యత్తు ఎలా వుంటుందోనని తల్లడిల్లుతున్నాను.... అంతేనండీ...!'' అంటూ ముగించిన వసుంధర కళ్ళు తుడుచుకుంది.

ఒక క్షణం ఎవరూ మాట్లాడలేదు. మళ్ళీ వసుంధరే అంది. ''నిన్న మీ ఇంటికి బయలుదేరినప్పుడు నాకు మనసులో కొంత బాధ, భయం ఉన్నమాట నిజమేగానీ... మహిమ ఇంటికి వచ్చాక మీ మధ్య జరిగిన సంభాషణ అంతా వివరంగా చెప్పాక, నాకు చాలా వూరటగా అనిపించిందండీ... నిజం!

ఏం జరిగినా గానీ... అంటే... ఏదో కీడు జరుగుతుందేమోననే ఆలోచనతో అనటం లేదు.... ఒకవేళ... నేను ముందు అనుమానించినట్లుగా... అబ్బాయి మళ్ళీ ఆ అలవాటుకి లొంగిపోయినాగానీ, అత్తామామల ఆసరా ఉంటుందనే నమ్మకం ఏర్పడింది. 'మీ రోజుల్లోలా కాదు, ఏం జరిగినా తట్టుకుని ఒంటరిగా బ్రతకగలననే ధీమా, ధైర్యం

ఉన్నాయి... అందువల్ల నువ్వేం భయపడకమ్మా...' అంటోంది మహిమ. నలుగురి ఆసరా లేకుండా ఒంటరిపోరాటం ఎంత కష్టమో తనకి అర్థం కావటం లేదని విసుక్కున్నాను. అయితే నిన్నటి మీ ఆదరణ గురించి విన్నాక... నాకు... నిశ్చింతగా ఉందండీ... నిజం...! అయితే... ఒక మాటకూడా చెప్పాలి. మహిమ నాన్న పెద్ద ఉద్యోగమే చేసినా, ఎంత హోదా, దర్జా వెలగబెట్టినా, ముందు చూపు లేకపోవటం వలన... ఉన్నది కాస్తా తెగనమ్మటమే కానీ, కొంతయినా పొదుపు చేయలేకపోయారు! జరిగిపోయినదాని గురించి తలుచుకుని బాధపడటం లేదు గానీ... ఇపుడు... మా తోటివాళ్ళను చూస్తూంటే... నాకనిపిస్తోంది... రోజు గడిచిపోతోంది కదాని నిశ్చింతగా ఉండటం కాదు, మరుసటి రోజుగురించి కొంతయినా ఆలోచన అవసరమేనని! నేను ఉద్యోగం చేస్తున్నాగానీ... పొదుపు చేయగలిగింది చాలా కొంచమే. తనని కట్న కానుకల ప్రసక్తి లేకుండా పెళ్ళికి సిద్ధపడే వ్యక్తినే అంగీకరిస్తానంటూ మా మహిమ ఎప్పటినుండో అంటూండేది. 'అలాగే జరుగుతోంది చూశావా'... అంది నిన్న నాతో. ఇంత హోదాలో ఉండి కూడా మీరు కేవలం పిల్లల ఇష్టాలకే ప్రాముఖ్యతనిచ్చి అంగీకరించటం... నాకు చాలా గొప్ప విషయంగా అనిపించింది! నా దగ్గరున్న మొత్తంతో పెళ్ళి ఘనంగా చేయగలనని మీకు చెబుదామనుకుంటున్నాను....''

చివరి మాటలను చాలా మెల్లగా సంకోచంగా పలికింది వసుంధర.

మనోరమ చిన్నగా నవ్వింది.

''మీ అనుభవాలను విని కూడా మీ అమ్మాయి ధైర్యంగా, ఇష్టంగా ఈ పెళ్ళికి సుముఖంగా ఉండటం గొప్ప విషయం! మీరు ఒక్కరుగా ఇంటి బాధ్యతలు నిర్వర్తించగలిగారంటే... అది... అది నిజంగా చాలా గొప్ప విషయం! మా వారు ఒకటి

రెండు సంవత్సరాలు మావాడు నిలకడగా  ఉన్న తర్వాతనే పెళ్ళి విషయం ఆలోచిద్దామన్నారు. కానీ... నేను... నిన్న మహిమను చూశాక, తన మాటలు విన్నాక వెంటనే పెళ్ళికి అంగీకరించినా ఫర్వాలేదు, మంచిదేననే నిర్ణయానికి వచ్చాను. మా వారికీ చెప్పి ఒప్పిస్తాను... అదంత ముఖ్యమైన విషయం కాదుగానీ... నేనూ మీతో కొన్ని విషయాలు చెప్పాలి. ఆ తర్వాత... అందరం కలిసి ఒక నిర్ణయానికి వద్దాం...'' అంటూండగానే లోపలనుండి వచ్చిన వంట చేసే మునిస్వామి ''అమ్మా.... అందరికీ కాఫీ, టీ... ఏం తీసుకురమ్మంటారూ...?'' అనడిగాడు.

మనోరమ ''స్వామీ... ఏదైనా టిఫిన్ కూడా చేయాలి. ఆ తర్వాతనే టీ...'' అని చెప్పగానే మహిమ లేచి నిలబడి ''నేను చేస్తానండీ...'' అంది.

''మేడమ్... మీరు.... ఎందుకూ... నేను చేస్తాగా...'' అని అతను అనగానే మనోరమ అతనితో ''ఫరవాలేదు... చేయనిద్దాం''... అని  '' వెళ్ళు మహిమా... నీకు ఏం కావాలన్నా స్వామి చూపిస్తాడు. నీకు ఏది చేయాలనిపిస్తే అదిచేయి...'' అని మహిమతో చెప్పింది మనోరమ.

మహిమ తలవూపి... స్వామితో వంటగదివైపు వెళ్ళాక వసుంధర చిరునవ్వుతో ''మా మహిమకి పకోడీ చేయటమే వచ్చు. సులువుగా అయిపోతుంది కూడా కదా, అదే చేస్తుందనుకుంటా...'' అని ''అవునూ.. మీరేదో చెబుతానన్నారూ...?'' అనడిగింది మనోరమని.

''ఏం లేదు... మా అబ్బాయి గురించే నేనూ నాకు తోచిన అభిప్రాయాలు చెబుదామని అంతే, మహిమనూ రానివ్వండి. తింటూ చెప్పుకుందాం...'' అంది.

ఒక క్షణం ఆగి మళ్ళీ మనోరమ ఆమెతో చెప్పింది ''ఈ లోపుగా మనమూ అలా మొక్కల మధ్య తిరిగి, ఇల్లూ చూసి వద్దాం... రండి...'' వసుంధరా లేచి నిలబడి ఆమె వెనుకే వెళ్ళింది.

అలా తిరుగుతూండగానే మనోరమ కొన్ని సంగతులూ కాలక్షేపం కబుర్లలా చెప్పింది.

''నిజం చెప్పాలంటే... ప్రభుత్వంలో అధికారిగా హోదా అయిన ఉద్యోగం చేస్తున్నారే గానీ, మాకూ ఆస్తిపాస్తులేం లేవండీ. రిటైరయ్యే లోపుగా ఉండటానికి చిన్న ఇల్లు కొనుగోలు చేయాలనే

ఉద్దేశ్యం ఉంది. అలాగే ఏదైనా చిన్న వ్యాపారం కూడా చూసుకోగలగాలి. వ్యాపకం గానూ, ఆధారంగానూ ఉంటుందని... అంటే.. మీకు అర్థమైందనుకుంటాను... మాదీ మామూలు మధ్య తరగతేనని. నిజాయితీగా ఉద్యోగధర్మం నిర్వర్తించే వాళ్ళకి... ఆత్మ సంతృప్తి తప్ప పెద్దగా ఆస్తిపాస్తులుండవనే విషయం మీకూ తెలిసి ఉంటుంది. పెద్దల ద్వారా కూడా మాకు పెద్దగా ఆస్తులేం రాలేదు, అందుకనే... నేను... మీకు... సలహాగా చెప్పేది ఏమిటంటే.. పెళ్ళిని ఘనంగా

చేయాలనే ఆలోచన వద్దని, పిల్లల ఇష్టప్రకారం ఎలా చేయాలో తర్వాత అందరం కలిసి ఆలోచన చేయవచ్చని నా ఉద్దేశ్యం...!''

మనోరమ మాటల్ని అంగీకరిస్తున్నట్లుగా వసుంధరా తలవూపింది.

ఇల్లు, వాకిలీ అంతా తిరిగి చూసి వచ్చేసరికి... అక్కడ పకోడీల ప్లేట్లు సిద్ధంగా కనుపించాయి. వాటిని చూస్తూనే వసుంధర చిరునవ్వుతో ''నేను చెప్పాను కదండీ...'' అంది మనోరమతో.

''అవును... మీ అమ్మాయి గురించి మీకంటే బాగా ఎవరికి తెలుస్తుందీ...!'' అంటూ మనోరమ చిన్నగా నవ్వింది.

''దేని గురించి... మీరిద్దరూ మాట్లాడుకుంటున్నారు...?'' అనడిగిన మహిమకి ''వీటి గురించే...'' అంటూ వసుంధర, తను చెప్పిన మాటల గురించీ చెప్పింది.

మహిమ చిన్నగా నవ్వి ''సింపుల్‌గా అయిపోతుందన్న కారణం ఒక్కటే కాదు, ఒకసారి ఎవరో మా ఇంటికి వచ్చినవాళ్ళు... నేనివి చేస్తే బాగా మెచ్చుకున్నారు. ఇక అప్పటినుండీ  నేనింకొకటి వేరే చెయ్యలేదు. ఎపుడు చేయాల్సివచ్చినా... ఇదే టిఫిను చేసేస్తాను మరి...!'' అంది.

మనోరమ రుచి చూస్తూ ''నిజమే నమ్మా... చాలా బావున్నాయి....'' అంటూ మెచ్చుకుంది.

మహిమ సరదాగా నవ్వేసి వూరుకుంది.

టీ తాగుతూ మనోరమ మాటలు కలిపింది. ''మా అబ్బాయి అభిరామ్ గురించీ... మీకు కొన్ని సంగతులు చెప్పాల్సిన బాధ్యత ఉందనిపిస్తోంది. నిజానికి వాడు ఇలా తయారవటంలో... నా పాత్ర ఉంది. చిన్నప్పటినుండీ వాడిలో మితిమీరిన ఆత్మవిశ్వాసం, అహం ఇలాంటి లోపాలు వేళ్ళూనటానికి నేనే కారణమనిపిస్తుంది!

వాడు హైస్కూలు చదువులో ఉండగానే ఒక సంవత్సరం... స్కూలు యానివర్సరీ పంక్షన్‌లో ప్రదర్శించటానికి చిన్న నాటికను రూపొందించాడు. తల్లిగా నాకు చాలా ఆనందాన్ని కలిగించిన సంఘటన. ఆ వయసులోనే తనకున్న రచనాశక్తికి, భాషాజ్ఞానానికి... మురిపెంతో ప్రశంసిస్తూన్నానని అనుకుంటూనే మితిమీరిన పొగడ్తలతో ముంచెత్తేశాను. అప్పటినుండే వాడిలో తను నలుగురి మాదిరి కాదనీ, ప్రత్యేకమనే భావన ఏర్పడిరదని... తర్వాత గ్రహించాను.

ఆ తరువాత... కాలేజీలో చేరాక ఇంటర్ లోనే అనుకుంటా... ఒక నాటిక రాసాడు. అప్పుడే వాడి ఫ్రెండొకడు ఏదో చిన్న చిన్న మార్పులు రెండు, చెబితే వినలేదు అలా కొంచెం మారిస్తే బావుంటుందని లెక్చరర్ కూడా సలహా ఇస్తే... వాడు వినిపించుకోలేదు, సరికదా, వాళ్ళకేం తెలుసంటూ చులకనగా మాట్లాడటం... నాకూ నచ్చలేదు. మెల్లగా నచ్చచెప్పే ప్రయత్నం చేయబోతే విదిలించేసాడు.

ఆ రోజు నాటకం ప్రదర్శన అయ్యాక అందరూ పొగడ్తలతో ముంచెత్తారు. నాటకం బావున్న మాట నిజమేగానీ, చిన్న చిన్న మార్పులతో మరింత బావుండేదని నాకూ అనిపించింది అయితే ఆ మాట చెప్పినా ప్రయోజనం ఉండదని మౌనంగా ఉండిపోయా. అప్పటినుండీ తనమీద తనకి నమ్మకం బాగా పెరిగిపోయింది.

తను అందరికంటే అధికుడననే విశ్వాసం స్థిరపడిపోయింది. ప్రవర్తనలో అది మాటిమాటికీ వెల్లడవుతూనే ఉండేది. అది గ్రహించి నేను హెచ్చరించబోయినా లక్ష్యపెట్టలేదు.

ఫ్రెండ్స్‌తో పార్టీ చేసుకున్నానంటూ... ఒకరోజు డ్రిరక్ తీసుకుని, ఒళ్ళు తెలియని స్థితిలో ఇంటికి వచ్చాడు. అది చూసిన వాళ్ళ నాన్న గట్టిగా మందలించారు. మామూలుగా ఆ అలవాటు ప్రారంభమయ్యే దశలో అందరూ చెప్పే మాటనే వాడూ ఉపయోగించాడు ''ఏదో ఒకరోజు సరదాగా ఫ్రెండ్స్‌తో డ్రింక్ తీసుకుంటే... ఏదో కొంప మునిగిపోయినట్లుగా నాన్న చిందులు తొక్కటం ఏమిటీ... అసలు అలవాటు లేకుండా తనలా మడికట్టుకుని కూర్చున్నట్లు ఉండటం కంటే... అలవాటు అయినా నిగ్రహంతో అదుపులో పెట్టుకోగలగటం గొప్ప విషయమని తెలుసుకుంటే మంచిది. క్రమశిక్షణ అంటూ నన్ను అదుపులో పెట్టాలనుకుంటే... అది కుదరని పని... అని నువ్వే చెప్పు... అమ్మా...!'' అంటూ చిన్న ఉపన్యాసమే ఇచ్చాడు.

వాడు దారి తప్పుతున్నాడనిపించి నాకు బాగా భయమేసింది. బ్రతిమాలుకుంటున్నట్లు అలాంటి అలవాటు జోలికి వెళ్ళొద్దన్నాను. అనునయంగా చెప్పటం వలనో ఏమోగానీ కొంచెం మెత్తబడి 'నేనేం... తాగుడికి అలవాటు పడిపోను.. నువ్వే చూస్తావుగా...!' అన్నాడు.

మాటమీద నిలబడే శక్తి ఉండదని... అది ఆ అలవాటు లక్షణమని తొందరలోనే తెలుసుకున్నాను! నేను మందలిస్తుంటే... మరింత మొండిగా తయారయ్యాడు. తండ్రి గట్టిగా కొప్పడితే.. 'దుర్మార్గం' అంటూ ఎదురు తిరిగేవాడు.

ఇంతలో పై చదువుకి ఢల్లీిలో సీటు వచ్చిందంటూ అక్కడికి వెళ్ళిపోయాడు. స్థలం, స్నేహితులు.... ఇలాంటి మార్పులతో కొంచెమైనా బాగుపడతాడేమోనని ఆశ పడ్డాంగానీ అది వమ్ము అయిపోయింది.

ఎలాగో డిగ్రీ చేతబట్టుకుని బయటపడగలిగాడు! దానికే సంతోషించాం. తన  తెలివితేటల్ని సరిగా ఉపయోగించుకుని వుంటే... మంచి స్థితిలో ఉద్యోగం చేస్తూండేవాడు. ఇక్కడే ఏదో ట్యూటోరియల్ కాలేజీలో కాలక్షేపానికంటూ ఉద్యోగంలో చేరాడు. కుదురుగా ఆ ఉద్యోగం చేసినా ఫరవాలేదని సంతోషపడ్డాం.

ఒకసారి డ్రిరకు తీసుకుని మితిమీరిన వేగంతో బండి నడుపుతుంటే పోలీసులు పట్టుకున్నారు. ఎలాగో అప్పటికి ఫైనుకట్టి తప్పించుకోగలిగాడు.

ఇంకోసారి తాగిన మైకంలో అసభ్యంగా ప్రవర్తించినందుకు ఒక అమ్మాయి కంప్లైంట్ ఇవ్వటంతో పోలీసులు అరెస్ట్ చేసారు. అపుడు తండ్రి పేరు చెప్పి తప్పించుకోవాలనుకున్నా కుదరలేదు. చట్ట ప్రకారం జరిగేది జరగనివ్వమని తను కల్పించుకోనని ఈయన తేల్చి చేప్పేశారు. కొన్నాళ్ళు జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. అప్పటినుండీ తండ్రిపై పగనీ పెంచుకున్నాడు...''

మహిమ మనోరమ మాటలకు అడ్డం వచ్చి ''అపుడు మీ అబ్బాయి మీద కంప్లైంట్ ఇచ్చిన అమ్మాయి పేరు మీకు తెలుసాండీ...?'' అనడిగింది.